పాఠాలు సులభ పద్ధతిలో బోధించాలి

పటాన్‌చెరు టౌన్: ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభమైన పద్ధతిలో అర్థమయ్యే విధంగా బోధించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. ఇస్నాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఏఐ, కోడింగ్, పైథాన్‌పై మూడు రోజుల పాటు జరుగుతున్న శిక్షణ శిబిరాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయులకు ఫిజికల్ కంప్యూటింగ్ కోర్సులతో పాటు కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై శిక్షణ ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో మ్యాథ్స్ టీచర్లు పాల్గొన్నారు.

ఉచిత అంబులెన్స్ సర్వీస్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు తెల్లాపూర్ మున్సిపాలిటీకి సీఎస్‌ఆర్ నిధుల ద్వారా అందించిన అంబులెన్స్ సర్వీస్ గురువారం నుంచి అందుబాటులోకి వచ్చింది. అంబులెన్స్ సిబ్బంది, డ్రైవర్‌ను అక్ష ఆసుపత్రి యాజమాన్యం సమకూరుస్తామంది. మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్ రెడ్డి , అక్ష ఆసుపత్రి డైరెక్టర్ డా.మధుసూదన్ , తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షులు రమణ తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న చెత్త

మియాపూర్ : మియాపూర్‌లోని దీప్తిశ్రీనగర్ కాలనీలో రోడ్ల పక్కన ఖాళీ ప్రదేశాల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించకపోవడంతో పేరుకుపోతుంది. చెత్తను ఆటోరిక్షాకు అందజేయాలని అధికారులు సూచిస్తున్నా ఖాళీ ప్రదేశాల్లో పారబోస్తున్నారు. తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడు అరెస్ట్

రాయదుర్గం: బీఆర్‌ఎస్ శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాను గురువారం తెల్లవారుజామున పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ చలో బస్‌భవన్ పిలుపు నేపథ్యంలో రాయదుర్గం పోలీసులు తెల్లవారుజామున ఆయన నివాసానికి చేరుకొని అదుపులోకి తీసుకుని రాయదుర్గం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం ఆయనను వదిలిపెట్టారు.

పొగాకు ముక్త్ భారత్‌లో భాగస్వాములవ్వాలి

కూకట్‌పల్లి: పొగాకు ముక్త్ భారత్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరి అన్నారు. వరల్డ్ నో టుబాకో డే సందర్భంగా కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పొగాకు వినియోగం, పరిణామాలు, ఆరోగ్యం, పొగాకు ముక్త్ భారత్‌ను నిర్మిద్దాం అనే నినాదంతో కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. టుబాకో ముక్తి భారత్ అనే నినాదం వెనుక పొగాకు రహిత భారతదేశం అనే లక్ష్యం ఉందని, దీని కోసం భారత ప్రభుత్వం జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమాన్ని 2007-08లో ప్రారంభించిందని తెలిపారు. పాఠశాలల నుంచి 100 మీటర్ల వరకు టుబాకో నిషేధిత ప్రాంగణంగా ప్రకటించాలని, తదనుగుణంగా బ్యానర్లు, అవగాహన పోస్టర్లను ప్రదర్శించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో భవిష్యత్ తరాల కోసం పొగాకు ముక్త్ భారత్ నిర్మిద్దాం అని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మల్లీశ్వరి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మమత, కోఆర్డినేటర్ ఉమాపతి, ఉపాధ్యాయులు రామ్మోహన్ రావు, వీఎస్ఎస్ శర్మ, దామోదర్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్, సుజాత, గాయత్రి, సక్కు బాయి తదితరులు పాల్గొన్నారు.

యూపీ స్టాల్స్ .. ఆకట్టుకుంటున్నాయ్..



కొనుగోలు చేస్తున్న సందర్శకులు

శిల్పారామంలో ఏర్పాటు చేసిన ఉత్తరప్రదేశ్ స్టాల్స్‌లో గృహాలంకరణ ఉత్పత్తులు ఆకట్టుకుంటున్నాయి. పాత ఫోన్‌లు, గడియారాలు, వుడ్‌తో తయారు చేసిన వాహనాలు, ఈఫిల్ టవర్ తదితరాలు ఉన్నాయి. అలాగే ఇత్తడి విగ్రహాలు రూ. 50 నుంచి లక్షలాది రూపాయలు పలుకుతున్నాయి. కాగా శిల్పారామం ప్రధాన ద్వారం వద్ద ఉత్పత్తుల గురించి తెలిపే విధంగా ఎల్‌ఈడీ టీవీని ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాల్స్, ఉత్పత్తుల వివరాలు ప్రదర్శిస్తున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు స్టాల్స్ అందుబాటులో ఉంటాయి. ఆర్డర్‌పై ప్రత్యేక డిజైన్‌లను తయారు చేసి ఇస్తామని కళాకారులు తెలిపారు.

– మాదాపూర్







శిల్పారామం ప్రధాన కూడలి వద్ద ఎల్‌ఈడీ టీవీ ఏర్పాటు










వుడ్‌తో తయారు చేసిన బైక్‌లు, ల్యాంప్స్, ఫోన్‌లు

పెంచిన బస్ చార్జీలను వెంటనే తగ్గించాలి

మియాపూర్ : పెంచిన బస్సు చార్జీలు వెంటనే తగ్గించాలని శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం బస్సు చార్జీలను పెంచడంతో బీఆర్‌ఎస్ తలపెట్టిన ఛలో బస్ భవన్ కార్యక్రమానికి నాయకులను వెళ్లనివ్వకుండా మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆర్టీసీ చార్జీలు పెంపునకు నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీ చేపట్టిన ఛలో బస్ భవన్‌కు వెళ్లకుండా పోలీసులు నిర్బంధించడం ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేయడమేనన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పుడు ఆర్టీసీ చార్జీలు పెంచి భారం మోపుతున్నారని ,చార్జీలను తగ్గించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అరెస్ట్ చేసిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు బీఎస్ఎన్ కిరణ్ యాదవ్, హరీష్‌రావు, బాబుమోహన్ మల్లేష్, జనార్దన్‌గౌడ్ తదితరులున్నారు.

బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు

మాదాపూర్: మహిళల్లో కేన్సర్‌పై అవగాహన పెంపొందించి ప్రారంభదశలోనే గుర్తించాలని గైనకాలజిస్టు డాక్టర్ ఎల్. జయంతిరెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో గురువారం బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన నెల సందర్భంగా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కూపన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం వల్ల ప్రాణాలు రక్షించవచ్చని తెలిపారు. ఉచిత స్క్రీనింగ్ కూపన్లు ఆక్టోబర్ 31 నుంచి మెడికవర్ కేన్సర్ హాస్పిటల్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. బ్రెస్ట్ కేన్సర్ పరీక్ష, పాప్‌స్మియర్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సబిత తదితరులు పాల్గొన్నారు.

ఐలా పారిశ్రామికవాడకు నీటి సౌకర్యాన్ని కల్పించండి


జలమండలి కార్యాలయంలో ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కోరిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్ ఐలా పరిధిలో గల పరిశ్రమలకు మంచినీటి కనెక్షన్లు లేకపోవడం మూలంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ప్రథమ ప్రాధాన్యతగా గుర్తించి ప్రతి పరిశ్రమకు మంచినీటి కనెక్షన్ ఇవ్వాలని జలమండలి ఎండి అశోక్ రెడ్డిని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. అదేవిధంగా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో గల బీహెచ్ఇఎల్ బీఈ మ్యాక్ సొసైటీ కాలనీవాసుల నుంచి వసూలు చేస్తున్న ఇంప్రూవ్‌మెంట్ చార్జీలను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో ఎండి అశోక్ రెడ్డితో ఎమ్మెల్యే సమావేశమయ్యారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో జలమండలి మంచినీటి సరఫరా, రిజర్వాయర్లు, నూతన కనెక్షన్లపై చర్చించారు. ప్రధానంగా పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఐలా పారిశ్రామికవాడలో వేలాదిమంది కార్మికులు పని చేస్తున్నారని తాగునీటి కోసం రోజు ఇబ్బందులు పడుతున్నారని పరిశ్రమల యాజమాన్యాల ప్రతినిధులు తన దృష్టికి తీసుకొని వచ్చారని పేర్కొన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో బీహెచ్‌ఈఎల్ కార్మికులు బీఈ మెక్ సొసైటీ పేరుతో ఇళ్లు కట్టుకున్నారని ఇటీవల మంచినీటి కనెక్షన్ల కోసం జలమండలికి దరఖాస్తు చేసుకోగా.. మూడు కోట్ల రూపాయలు చెల్లించాలని ఇందులో 86 లక్షల రూపాయలు ఇంప్రూవ్‌మెంట్ చార్జీలు కట్టాలని నోటీసులు అందజేశారని తెలిపారు. ప్రస్తుతం కాలనీలో అత్యధిక శాతం ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు నివసిస్తున్నారని 86 లక్షలు చార్జీలను రద్దు చేస్తే మిగతా డబ్బులు కట్టేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని అశోక్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎండి అశోక్ రెడ్డి అతి త్వరలో వీటికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. సమావేశంలో రామచంద్రాపురం మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఐలా ప్రతినిధులు సురేందర్ రెడ్డి, శ్రీనివాస్, మాజీ ప్రజా ప్రతినిధులు నరసింహ, ఉమేష్, మధు, బీఈ మ్యాక్ అధ్యక్షులు శివ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

- 10 లీటర్ల సారా, ద్విచక్ర వాహనం స్వాధీనం
- కేసు నమోదు..రిమాండ్‌కు తరలింపు


నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసిన శంషాబాద్ ఎస్‌టీఎఫ్ పోలీసులు

చందానగర్ : నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను శంషాబాద్ డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు...నానక్‌రాంగూడకు చెందిన బజార్‌వాలె కిషన్‌సింగ్ అతని భార్య బజార్‌వాలె రేఖాబాయిలు కలిసి ధూల్‌పేట్‌కు చెందిన రాధికా బాయి, శంకర్‌ల వద్ద నుంచి సుమారు 10 లీటర్ల నాటు సారాను కొనుగోలు చేసి నానక్‌రాంగూడలోని కూలీలకు విక్రయిస్తున్నారు. ఒక లీటర్ రూ.400లకు అమ్ముతున్నారు. విషయం తెలుసుకున్న శంషాబాద్ డీటీఎఫ్ పోలీసులు, రంగారెడ్డి డీసీ దశరథ్, శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణ ప్రియ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నాటు సారా విక్రయిస్తున్న కిషన్‌సింగ్ దంపతులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారాతో పాటు ఒక హోండా యాక్టివా స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిద్దరిని శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులను నిందితులిద్దరిని రిమాండ్‌కు తరలించారు. ఈ దాడులలో డీటీఎఫ్ సీఐ ప్రవీణ్ కుమార్, ఫక్రుద్దీన్, మలేష్, నెహ్రూ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

12న 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. 'చూజింగ్ ఫీలింగ్స్' అనే అంశంపై హైదరాబాద్‌కు చెందిన సీనియర్ రాజ యోగ టీచర్ బి.కె.రుచి ఉపన్యాసం ఇస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

కాలనీలో వసతుల కల్పనకు కృషి

ఆల్విన్‌కాలనీ: వెంకట పాపయ్య నగర్ కాలనీలో వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. గురువారం అసోసియేషన్ ప్రెసిడెంట్ జూపల్లి జనార్దన్‌రావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కలిసి సమస్యలు వివరించారు. పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీ వాసులు కోరిన విధంగా పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో దేవేందర్, జీవన్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, వెంకటస్వామి గౌడ్, నరసింహులు, మహీందర్‌రావు, దయాకర్, బాలాజీ, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

సైబరాబాద్ అదనపు డీసీపీ హన్మంత్‌రావు



మణికొండ: ప్రయాణికులకు పూర్తి స్థాయిలో భద్రత కల్పించటంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ అదనపు డీసీపీ జి.హన్మంత్‌రావు అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, గొలిదొడ్డిలోని ప్రధాన్ కన్వెన్షన్‌లో గురువారం గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆటోడ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆటో డ్రైవర్లు యూనిఫామ్ ధరించాలని, ఆటోకు సంబంధించిన అన్ని పత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దన్నారు. రోడ్లపై కేటాయించిన స్టాండ్‌లలోనే ఆటోలను నిలపాలని, ఎక్కడ పడితే అక్కడ నిలిపినా, ట్రాఫిక్ జాంలకు, ప్రమాదాలకు కారణమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ కె.చంద్రశేఖర్‌రెడ్డి, అదనపు ఇన్‌స్పెక్టర్ జి.లవకుమార్, ఎస్ఐ వీరబ్రహ్మం, ఎస్ఐలు, 200 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మంచిరేవులకు మూసీ గోస!

- లో లెవల్ వంతెనలతో ఇబ్బందులు
- నెల రోజులుగా నరకయాతన
- వరద వస్తే రాకపోకలు బంద్
- అటకెక్కిన కొత్త వంతెన నిర్మాణం

మణికొండ: భారీ వర్షం, వరద కారణంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి ఆనుకుని ఉన్న మున్సిపాలిటీలోని ఓ గ్రామానికి నెల రోజులుగా రాకపోకలు నిలిచిపోయినా పట్టించుకునే నాథుడే లేరంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం గండిపేట చెరువు ఇప్పటికి 8 సార్లు పూర్తిగా నిండడంతో గేట్లు తెరిచారు. అలా గేట్లు తెరచిన ప్రతి సారీ నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల గ్రామ ప్రజలు మూసీ నదిని దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం నుంచి గ్రామానికి రాకపోకలు సాగించేందుకు దశాబ్దాల క్రితం నిర్మించిన లో లెవల్ వంతెన ఉంది. గండిపేటలో ఆరు గేట్లు ఎత్తారంటే నీరు దానిపై నుంచి ప్రవహిస్తుంది. దాంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి.


తగ్గులో ఉన్న రాయల్ ఫంక్షన్‌హాల్ రోడ్డు వంతెన


మంచిరేవుల వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద

మరో రెండు చోట్ల అదే పరిస్థితి...

నార్సింగి మున్సిపాలిటీ కేంద్రానికి అనువుగా ఉన్న దగ్గరి దారి మూసి వేస్తే పక్కనే ఉన్న ఔటర్‌రింగ్ రోడ్డు సర్వీసు రోడ్డులో రాకపోకలు సాగించేందుకు వీలు ఉండేది.


తక్కువ ఎత్తులో ఉన్న మంచిరేవుల-నార్సింగి వంతెన


ఔటర్ సర్వీసు రోడ్డు

మరింత వరద పెరగగానే దాన్నీ మూసి వేస్తున్నారు. రాయల్ ఫంక్షన్ హాల్ వద్ద నుంచి ఉన్న మరో దారి పరిస్థితీ అలాగే మారింది. గ్రామానికి ఇటువైపుగా ఉన్న మూడు దారులను మూసి వేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక కిలోమీటరు దూరం ఉన్న నార్సింగికి మంచిరేవుల నుంచి పోలీస్ అకాడమీ, బండ్లగూడ, టిప్పుఖాన్ బ్రిడ్జిల మీదుగా 15 కిలోమీటర్లు తిరిగి నార్సింగికి రాకపోకలు సాగించాల్సి వస్తున్నదని గ్రామస్తులు వాపోతున్నారు.

మొదలు కాని పనులు...

మూసీ నదిపై పాత వంతెనలకు తోడుగా మరో ఆరు చోట్ల కొత్త వంతెనలను నిర్మించాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపాదనలను సిద్ధం చేసింది. రూ. 150 కోట్ల వ్యయంతో హెచ్ఎండీఏ వాటిని నిర్మించేందుకు టెండర్లను సైతం పిలిచారు. వాటిలో హైదర్‌షాకోట్ నుంచి ఇబ్రహీంబాగ్, మంచిరేవుల నుంచి రాయల్ ఫంక్షన్ హాల్, మంచిరేవుల నుంచి నార్సింగికి వచ్చే రోడ్ల వద్ద ఎత్తుగా నిర్మించాలని నిర్ణయించారు. అప్పట్లో నిధుల లభ్యత లేకపోవటంతో పనులను చేపట్టలేకపోయారు. నేడు ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా హైదరాబాద్ నగర శివార్ల రోడ్లు, వంతెనలపై దృష్టి పెట్టకపోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి పనులను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులను రాబట్టాల్సిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పట్టించుకోకపోవటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త వంతెన నిర్మించాలి

భారీ వర్షాలకు పలుమార్లు గండిపేట రిజర్వాయర్ గేట్లను తెరవటంతో మంచిరేవుల, నార్సింగిల మధ్య ఉన్న మూడు వంతెనలను మూసి వేస్తున్నారు. దాంతో నార్సింగికి వెళ్లిరావాలంటే పడరాని పాట్లు పడాల్సి వస్తున్నది. ప్రభుత్వం కొత్త వంతెన నిర్మించాలి.

– డి.లక్ష్మణ్, మాజీ వార్డు సభ్యుడు, మంచిరేవుల

అటకెక్కిన వంతెన పనులు

బీఆర్‌ఎస్ పాలనలో మంచిరేవుల వాసుల సమస్య తీర్చేందుకు కొత్త వంతెనల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. అయితే ప్రభుత్వం మారటంతో ఆ పనులు కాస్తా అటకెక్కాయి. రోడ్లు, వంతెనల నిర్మాణాలను ఎప్పటికప్పుడు చేపట్టాల్సిన పాలకులు వాటిని విస్మరించారు.

– కె.విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, నార్సింగి మున్సిపాలిటీ

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా...

నెల రోజులుగా మంచిరేవుల వాసులు నార్సింగికి వచ్చేందుకు 15 కిలోమీటర్ల దూరం తిరిగి రాకపోకలు సాగిస్తున్నారు. ఇన్ని రోజుల నుంచి సమస్య పరిష్కారానికి నోచుకోకపోవటం దారుణం. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నిధులను రాబట్టాలి. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో పెట్టాలి.

– ఎం.నాగపూర్ణ శ్రీనివాస్, మాజీ చైర్‌పర్సన్, నార్సింగి

పడరాని పాట్లు...

మంచిరేవుల గ్రామస్తులు పక్కనే ఉన్న నార్సింగికి వచ్చి పోయేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం ప్రారంభం కానున్న మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనుల్లో మంచిరేవులకు రెండు వంతెనలు నిర్మించాలని కోరతాం. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో చేయకపోతే సమస్య అలాగే ఉంటుంది. త్వరలోనే ఎమ్మెల్యే, మూసీ ప్రాజెక్టు అధికారులను కలిసి వివరిస్తాం.

– కె.దశరథయాదవ్, వైస్ చైర్మన్, నార్సింగి మార్కెట్ కమిటీ

దశలవారీగా సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: గోపన్‌పల్లిలో త్వరలోనే పర్యటించి దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. గురువారం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గోపన్‌పల్లివాసులు ఎమ్మెల్యేను కలిసి స్థానిక సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ అవసరమైన చోట రోడ్లు, యూజీడీ పైప్‌లైన్‌లు ఏర్పాటు చేయిస్తామన్నారు. అంసపూర్తి రోడ్డు పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌతమ్‌గౌడ్, దాత్రినాథ్‌గౌడ్, యాదగిరిగౌడ్, అనిల్, నర్సింహ, శ్రీరామ్‌రెడ్డి, నర్సింగ్‌రావు, సత్యనారాయణ, జితేందర్, రాజేందర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ నిర్మించాలని వినతి

చందానగర్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో సగర (ఉప్పర) సంఘం కమ్యూనిటీహాల్ నిర్మించాలని గురువారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని కాలనీవాసులు కలిసి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కమ్యూనిటీహాల్ నిర్మాణం కొరకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో గౌతమ్‌గౌడ్, సగర సంఘం అధ్యక్షులు వెంకట్రాములు, గౌరవ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, తిరుపతయ్య, సాయిబాబా, శ్రీనివాస్, శివ, వెంకటేష్ ,నాగరాజు తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే గాంధీని కలిసిన గోపన్‌పల్లివాసులు